సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

ఆదివారం । 9 । జూలై । 2023


పాడేరులో వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి


నివాళులర్పిస్తున్న ఎంపీ మాధవి,భర్త శివప్రసాద్


వైఎస్సార్ విగ్రహం వద్ద నినాదాలు చేస్తున్న ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, పార్టీ శ్రేణులు


చింతూరులో వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ధనలక్ష్మి

ఆత్మ బంధువుకు ఆత్మీయ నివాళి

- వాడవాడలా వైఎస్సార్ జయంతి
- విస్తృతంగా సేవా కార్యక్రమాలు

సంక్షేమ పాలన ఎలా ఉండాలో... ప్రజలకు ఏం కావాలో... నాయకుడు ఎలా నడవాలో.. చేతల్లో చేసి చూపించిన దార్శనికుడు, ప్రజా హితం కోసం అహర్నిశలు శ్రమించిన సంక్షేమ ప్రదాత, దూరమై ఇంకా దగ్గరై అందరి గుండెల్లో కొలువైన మహా మనీషి డాక్టర్ వై.ఎస్. రాజశేఖర రెడ్డి. శనివారం జయంతి సందర్భంగా జిల్లా వ్యాప్తంగా వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, సామాన్య ప్రజలు ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. సేవాకార్యక్రమాలతో స్మరించుకున్నారు. విగ్రహాలకు పూలమాలలు వేసి అంజలి ఘటించారు.

సాక్షి,పాడేరు: మహానేత, దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి ఆశయ సాధనే లక్ష్యంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి అన్నారు. వైఎస్సార్ జయంతిని జిల్లా కేంద్రమైన పాడేరులో ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి అధ్యక్షతన శనివారం ఘనంగా నిర్వహించారు. పాతబస్టాండ్‌లోని వైఎస్సార్ విగ్రహానికి ఎమ్మెల్యేతో పాటు ట్రైకార్ చైర్మన్ సతక బుల్లిబాబు,వైఎస్సార్‌సీపీనాయకులు క్షీరాభిషేకం చేసి,పూలమాలలతో ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా భాగ్యలక్ష్మి మాట్లాడుతూ పోడుభూములు సాగుచేస్తున్న గిరిజనులకు హక్కులు కల్పించడంతో పాటు ఎన్నో పథకాలను వైఎస్సార్ అమలుచేశారని చెప్పారు. తండ్రిబాటలో నడుస్తూ సీఎం వై.ఎస్.జగన్ గిరిజనుల పక్షపాతిగా నిలిచారని, బాక్సైట్ జీవోలను రద్దు చేయడంతో పాటు, రూ.50కోట్లతో పాడేరులో మెడికల్ కళాశాలను నిర్మిస్తున్నారని తెలిపారు. విద్య, వైద్యరంగాల్లో అనేక మార్పులు తీసుకువచ్చారని, అన్నిగ్రామాలకు రోడ్లు, రవాణావ్యవస్థను మెరుగు పరుస్తున్నారని చెప్పారు.

అనాథ చిన్నారులకు పుస్తకాలు, భోజనం

తలారిసింగిలోని అనాథ శరణాలయంలో వసతి పొందుతున్న 60మంది చిన్నారులకు పుస్తకాలు,పెన్నులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. వారికి భోజనం సమకూర్చి ఎమ్మెల్యే,పార్టీనేతలు వడ్డించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు సీదరి రాంబాబు,వ్యవసాయ సలహామండలి జిల్లాఅధ్యక్షురాలు సరస్వతి,పార్టీ జిల్లా పంచాయతీరాజ్ విభాగం అధ్యక్షుడు గబ్బాడ చిట్టిబాబు,ఎస్టీసెల్‌జోనల్ ఇన్‌చార్జి కిముడు విశ్వ,వైస్ ఎంపీపీ కె.కనకాలమ్మ,ఎంపీటీసీలు నరసింహమూర్తి, సన్యాసిరావు,గిడ్డి విజయలక్ష్మి,చల్లా చిట్టమ్మ, సర్పంచ్‌లు లకే పార్వతి,రాంబాబు,లక్ష్మణరావు, నీలకంఠం, బసవన్నదొర, మాజీ ఎంపీపీలు సీదరి మంగ్లన్నదొర, రమణమూర్తి, పార్టీ సీనియర్ నాయకులు లకే సత్యవతి, కోడా సుశీల, కన్నాపాత్రుడు, లింగమూర్తి, కొండాజీ, నాగేంద్ర,శివరాత్రి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రాణదాత వైఎస్సార్

కొయ్యూరు: ఆరోగ్యశ్రీ పథకాన్ని అమలు చేసి ఎందరో పేదలకు ప్రాణదానం చేసిన మహానేత వై.ఎస్.రాజశేఖరరెడ్డి అని అరకు ఎంపీ గొడ్డేటి మాధవి అన్నారు. విశాఖలోని పార్టీకార్యాలయంలో శనివారం రాజశేఖర రెడ్డి చిత్రపటానికి భర్త శివప్రసాద్‌తో కలిసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ పేదల సంక్షేమమే ధ్యేయంగా రాజశేఖరరెడ్డి పలు సంక్షేమ పథకాలు అమలుచేశారని చెప్పారు.గూడెంకొత్తవీధి సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు కుందెలి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పేదల పక్షపాతి

అరకులోయ రూరల్: దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్. రాజశేఖర రెడ్డి పేదల పక్షపాతి అని, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి పలు సంక్షేమ పథకాలు అమలు చేశారని ఎమ్మెల్యే చెట్టిపాల్గుణ తెలిపారు. స్థానిక నాలుగు రోడ్ల జంక్షన్ వద్ద ఎమ్మెల్యే ఆధ్వర్యంలో వైఎస్సార్ జయంతిని ఘనంగా నిర్వహించారు. స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే కేక్ కట్ చేశారు. అనంతరం మాట్లాడుతూ వైఎస్సార్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్టీసెల్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి శెట్టి గంగాధర స్వామి, పార్టీ మండల అధ్యక్షుడు గాసి, యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి చెట్టి వినయ్, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు కిరణ్‌కుమార్, వైస్ ఎంపీపీ రామన్న, ఏఎంసీ చైర్మన్ రాజారమేష్, ఏఎంసీ మండల కన్వీనర్‌సంపత్‌కుమార్, పీఏసీఎస్ పర్సన్‌ఇన్‌చార్జి హస్తినకుమార్‌తదితరులుపాల్గొన్నారు.

సంక్షేమ ప్రదాత..

చింతూరు: పేదల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేయడం ద్వారా దివంగత నేత వైఎస్సార్ సంక్షేమ ప్రదాతగా నిలిచారని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి అన్నారు. వైఎస్సార్ జయంతిని పురస్కరించుకుని చింతూరు మెయిన్‌రోడ్ సెంటర్లో వైఎస్సార్ విగ్రహానికి ఆమె పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ, రుణమాఫీ, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి పథకాలతో పేదలకు అండగా నిలిచారన్నారు. తండ్రి అడుగు జాడల్లోనే నడుస్తూ ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని తెలిపారు. అనంతరం స్థానిక ఏరియా ఆస్పత్రిలో రోగులకు పాలు, రొట్టె, పండ్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్టీ కమిషన్ సభ్యుడు చిచ్చడి మురళి, ఎంపీపీ సవలం అమల, వైస్ ఎంపీపీ మేడేపల్లి సుధాకర్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ యగుమంటి రామలింగారెడ్డి, సచివాలయ మండల కన్వీనర్ కోట్ల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

పర్యాటకుల జోష్


కొత్తపల్లి జలపాతం వద్ద సందడి చేస్తున్న పర్యాటకులు

జి.మాడుగుల: కొత్తపల్లి జలపాతానికి పలు ప్రాంతాల నుంచి పర్యాటకులు వచ్చి సందడి చేశారు. పలు ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, విద్యాసంస్థలకు రెండో శనివారం సెలవు కావడంతో టూరిస్టు బస్సులు,కార్లు,ఆటోలు తదితర వాహనాల్లో విద్యార్థులతో పాటు పర్యాటకులు వచ్చారు. వయస్సుతో సంబంధం లేకుండా గంటల తరబడి కేరింతలతో ఇక్కడ జలకాలాడారు. జలపాతం ప్రాంతంలోని పెద్దపెద్ద రాళ్లపై కూర్చొని వెంట తెచ్చుకున్న ఫలహారాలను తిని, రోజంతా ఉల్లాసంగా..ఉత్సాహంగా గడిపారు.

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి ..


పార్టీ కండువావేసి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

చింతపల్లిరూరల్: మండలంలోని చెరకుంపాకలు,లోతుగడ్డ గ్రామాల్లో టీడీపీకి చెందిన 10 కుటుంబాల గిరిజనులు శనివారం వైఎస్సార్‌సీపీలో చేరారు. చింతపల్లిలో జరిగిన వై.ఎస్.రాజశేఖరరెడ్డి జయంతి కార్యక్రమంలో పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి సమక్షంలో వీరు పార్టీలో చేరారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నట్టు తెలిపారు. పార్టీలో చేరిన వారికి ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు.

నేడు మోదమ్మకు శాకంబరి అలంకరణ

సాక్షి, పాడేరు: జిల్లా కేంద్రం పాడేరులోని మోదకొండమ్మతల్లి ఆదివారం శాకంబరిగా దర్శనమివ్వనున్నారు.ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో మోదకొండమ్మతల్లి శాకంబరి ఒకరోజు ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. శనివారం సాయంత్రం నుంచి శాకంబరి అలంకరణ పనులు ప్రారంభమయ్యాయి. ఏపీ మెడికల్ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ తమర్బ నరసింగరావు,ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కొట్టగుల్లి సింహాచలంనాయుడు ఏర్పాట్లను పరిశీలిస్తున్నారు.

1623 మంది రైతులకు రూ.2.51కోట్ల పరిహారం

కలెక్టర్ సుమిత్ కుమార్


మహిళా రైతులకు వైఎస్సార్ బీమా పరిహారం చెక్కును అందజేస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ సతక బుల్లిబాబు

సాక్షి,పాడేరు: కరువు ప్రాంతాలతో పాటు వర్షాభావ పరిస్థితుల్లో పంటలు నష్టపోయే రైతులకు వైఎస్సార్ ఉచిత పంటల బీమాను ప్రభుత్వం అమలు చేస్తోందని కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు.మహానేత డాక్టర్ వైఎస్సార్ జయంతిని పురస్కరించుకుని వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో పాడేరు కాఫీ అతిథి గృహంలో రైతు దినోత్సవాన్ని శనివారం నిర్వహించారు. కలెక్టర్ సుమిత్ కుమార్, ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి జ్యోతిప్రజ్వలన చేశారు. డాక్టర్ వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి, క్షీరాభిషేకం చేశారు. అనంతరం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రైతు సదస్సులో చేసిన ప్రసంగాన్ని లైవ్‌లో రైతులంతా వీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 1,623 మంది రైతులకు డాక్టర్ వైఎస్సార్ ఉచిత పంటల బీమా కింద రూ.2,50,97,036 నగదును సీఎం జగన్‌మోహన్‌రెడ్డి డీబీటీ పద్ధతిలో వారి బ్యాంకు ఖాతాలకు జమచేశారని చెప్పారు. జిల్లాలో సుమారు 3లక్షల ఎకరాల విస్తీర్ణంలో రైతులు పంటలు సాగుచేస్తున్నారని,1.46 లక్షల ఎకరాలకు రైతు భరోసాను అమలుజేస్తున్నామని చెప్పారు. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి రైతు బాంధవుడని ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి అన్నారు.తండ్రి బాటలోనే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రైతుల సంక్షేమం లక్ష్యంగా వినూత్న కార్యక్రమాలను అమలుజేస్తున్నారని చెప్పారు. అనంతరం కలెక్టర్ సుమిత్ కుమార్,రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ సతక బుల్లిబాబు,జిల్లా వ్యవసాయ సలహా మండలి అధ్యక్షురాలు ఎం.సరస్వతిలు పంటల బీమా చెక్‌ను మహిళా రైతులకు అందజేశారు. వ్యవసాయశాఖ ప్రదర్శించిన వ్యవసాయ పరికరాలు,ఇతర యంత్రాలను కలెక్టర్ పరిశీలించారు.ఈ కార్యక్రమంలో ఎంపీటీసీలు గిడ్డి విజయలక్ష్మి,నరసింహమూర్తి, చల్లా చిట్టమ్మ,సర్పంచ్‌లు సీదరి రాంబాబు,వంతాల రాంబాబు,కురబొయిన సన్నిబాబు,లకే పార్వతమ్మ,జి.నీలకంఠం,గబ్బాడి చిట్టిబాబు,సోమెలి లక్ష్మణరావు,జిల్లా వ్యవసాయాధికారి ఎస్.బి.ఎస్.నందు,జిల్లా ఉద్యానవన అధికారి రమేష్ కుమార్,మాజీ ఎంపీపీ సీదరి మంగ్లన్నదొర,వైఎస్సార్‌సీపీ నాయకులు కోడా సుశీల,ఐశ్వర్యరాణి, మినుముల కన్నాపాత్రుడు పాల్గొన్నారు.

చింతూరు: రైతు సంక్షేమమే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ ధ్యేయమని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ రైతులకు ఎల్లప్పుడూ అండగా ఉంటున్నారని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి అన్నారు. వైఎస్సార్ రైతు దినోత్సవం సందర్భంగా స్థానిక ఐటీడీఏలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ గత ఏడాది ఖరీఫ్ సీజన్‌లో పంటలు నష్టపోయిన చింతూరు, వీఆర్‌పురం మండలాలకు చెందిన 1,026 మంది రైతులకు రూ.1.88 కోట్లు పరిహారం అందించడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా వైఎస్సార్ ఉచిత పంటలబీమా కింద మంజూరైన పరిహారం చెక్కును ఆమె రైతులకు అందచేశారు. ఈ కార్యక్రమంలో ఎస్టీ కమిషన్ సభ్యుడు చిచ్చడి మురళి, ఎంపీపీ సవలం అమల, వైస్ ఎంపీపీ మేడేపల్లి సుధాకర్, కో ఆప్షన్ సభ్యుడు ఎండీ అక్బర్‌అలీ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ యగుమంట రామలింగారెడ్డి, వ్యవసాయశాఖ ఏడీఈ కాశీవిశ్వనాథ చౌదరి, ఏవో శ్రీనివాసరావు,సర్పంచ్‌లు పాల్గొన్నారు.

మలేరియా కేసులపై అప్రమత్తం

రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ సంచాలకులు రామిరెడ్డి


మలేరియా బాధితుడితో మాట్లాడుతున్న రామిరెడ్డి

అనంతగిరి: మలేరియా కేసులపై అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ సంచాలకులు వి.రామిరెడ్డి ఆదేశించారు. మండలంలోని భీమవరం, అనంతగిరి పీహెచ్‌సీల పరిధిలో పలు గ్రామాల్లో ఆయన శనివారం పర్యటించారు. ముందుగా పీహెచ్‌సీలకు వెళ్లి, వైద్య సేవలపై ఆరా తీశారు. అనంతరం భీమవరం పీహెచ్‌సీ పరిధిలోని చిప్పపల్లిలో పిచికారీ పనులను పరిశీలించారు. దోమతెరల ఎలా వినియోగిస్తున్నారో మండపర్తిలో గిరిజనులను అడిగితెలుసుకున్నారు. అనంతరం అనంతగిరి పీహెచ్‌సీ పరిధిలో పీహెచ్‌సీ కాలనీలో మలేరియా పాజిటివ్ వచ్చిన సమర్ది గుండు అనే గిరిజనుడి ఇంటికి వెళ్లి ఆరోగ్యంపై ఆరా తీశారు. వైద్య సిబ్బంది వచ్చారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. పాజిటివ్ కేసులపై ఎంపీహెచ్‌డబ్ల్యూవో పర్యవేక్షణ ఉండాలన్నారు. ఆశ కార్యకర్తలు వారి పరిధిలో ఉన్న ఇళ్లకు వెళ్లి, దోమతెరలు వినియోగంపై అవగాహన కల్పించాలని, దోమల నివారణ మందు పిచికారీ జరుగుతుందా లేదా అనేది క్షేత్రస్థాయిలో వైద్య సిబ్బంది పర్యవేక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో విశాఖపట్నం డీఎంవో వై.మణి, అల్లూరి జిల్లా డీఎంవో సాంబమూర్తి, విశాఖపట్నం, అల్లూరి జిల్లాల ఏంవోలు డి.వి.రమణ, సత్యనారయణ, అనంతగిరి వైద్యాధికారి జ్ఞానేశ్వరీ పాల్గొన్నారు.

క్లుప్తంగా

సంప్రదాయ బొకేలకు కలెక్టర్ ఫిదా



పూల బొకెలను పరిశీలిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి

సాక్షి,పాడేరు: కమ్యూనిటీ బెస్ట్ నేచర్ ఫార్మింగ్ సభ్యులు తయారుచేసిన సంప్రదాయ బొకేలు కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను ఎంతో ఆకర్షించాయి. కాఫీ అతిథి గృహంలో శనివారం జరిగిన రైతు సదస్సులో ఇచ్చిన బొకేలను చూసి కలెక్టర్ ఫిదా అయ్యారు. వాటి కోసం పక్కనే ఉన్న ఎమ్మెల్యే భాగ్యలక్ష్మిని ఆరాతీశారు. పసుపు పువ్వును వెదురుబొంగుతో అలంకరించి తయారీ చేసిన బొకే ఆకర్షణీయంగా ఉంది. బొకేలను అందజేసిన మహిళలను కలెక్టర్ అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



వెంకటరావు మృతదేహం

పాడేరు రూరల్ : పాడేరు-చోడవరం ప్రధాన రహదారి ఘాట్‌లో ద్విచక్ర వాహనాన్ని గుర్తు తెలియని బొలేరా వాహనం ఢీ కొట్టడంతో ఒకరు మృతి చెందారు. పాడేరులో బోర్‌వెల్స్ నిర్వహిస్తున్న వెంకటరావు అనే వ్యక్తి శనివారం వ్యక్తిగత పనుల నిమిత్తం మైదాన ప్రాంతం నుంచి పాడేరుకు స్కూటీపై వస్తుండగా పాడేరు నుంచి మైదాన ప్రాంతానికి వెళ్తున్న ఓ బొలేరో వాహనం ఘాట్‌రోడ్డులోని సోమాలమ్మ మలుపు వద్ద ఢీకొట్టింది. దీంతో స్కూటీతో పాటు వెంకటరావు లోయలోకి పడిపోయాడు. తీవ్ర గాయాల పాలైన అతడిని స్థానికులు గుర్తించి మాడుగుల ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వెంకటరావు మృతిచెందాడు. పాడేరు పోలీసులు కేసు నమోదు చేశారు.

రూ.5.10 కోట్ల రోడ్ల పనులకు శంకుస్థాపన

- మిషన్ కనెక్ట్ పాడేరులో ప్రతీ మారుముల పల్లెకు రహదారి
- పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి

సాక్షి,పాడేరు: మిషన్ కనెక్ట్ పాడేరులో ప్రతీ మారుమూల గ్రామానికి రోడ్లు నిర్మించి,రవాణా సదుపాయాల కల్పనకు ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేస్తోందని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి తెలిపారు. పాడేరు మండలంలోని వనుగుపల్లి పంచాయతీ, చింతగున్నల నుంచి జి.మాడుగుల మండలం సొలబం పంచాయతీ గుంజిగెడ్డ గ్రామానికి వెళ్లే తొమ్మిది కిలోమీటర్ల రోడ్డుకు రూ.2.70 కోట్లు, పాడేరు మండలం వనుగుపల్లి పంచాయతీ బంగారుమెట్ట గ్రామం నుంచి జి.మాడుగుల మండలం వంతాల వరకు 8 కిలోమీటర్ల రోడ్డుకు రూ.2.40 కోట్లను మిషన్ కనెక్ట్ పాడేరులో ప్రభుత్వం మంజూరు చేసిం



కొబ్బరికాయ కొట్టి రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి

ది. ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి శనివారం ఈ రోడ్డు పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈరెండు రోడ్ల నిర్మాణం పూర్తయితే పాడేరు మండలం వంట్లమామిడితో జి.మాడుగుల మండలం వంతాల పంచాయతీలోని 10 గ్రామాలకు,వనుగుపల్లి పంచాయతీ నుంచి జి.మాడుగుల మండలం వంతాల పంచాయతీకి రవాణా సౌకర్యం మెరుగుపడుతుందని చెప్పారు. జి.మాడుగుల జెడ్పీటీసీ,ఎస్టీసెల్ రాష్ట్ర అధ్యక్షురాలు డాక్టర్ మత్స్యరాస వెంకటలక్ష్మి కూడా వంతాల రోడ్డు పనులకు కొబ్బరికాయ కొట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మారుమూల గ్రామాలకు రోడ్లు నిర్మిస్తుండడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జి.మాడుగుల మండల అధ్యక్షుడు సుర్మని కొండబాబు, మండల కన్వీనర్ లంకేల కళ్యాణ్, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు మఠిబండి రామకృష్ణ,పాడేరు,జి.మాడుగుల మండలాల సర్పంచ్‌లు రాంబాబు,జి.పద్మ, ఐసారం హనుమంతరావు,కిముడు రాంబాబు,సీదరి కొండబాబు,ఎంపీటీసీలు గబ్బాడి సన్యాసిదొర,మీనా,మాజీ ఎంపీపీ మత్స్యరాస వెంకటగంగరాజు,ఏఎంసీ మాజీ చైర్మన్ రాంబాబు,సచివాలయల కన్వీనర్లు బోనంగి బాలయ్యపడాల్,దేముడు,ఇంజనీరింగ్ అసిస్టెంట్ సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

నాటుతుపాకీ పేలి ఒకరి మృతి

పాడేరు రూరల్ : నాటుతుపాకీ పేలిన ఘటనలో ఒకరు మృతి చెందారు. పాడేరు మండలం దేవాపురం పంచాయతీ డి.కొత్తూరు గ్రామంలో జరిగిన ఈ ఘటన వివరాలను పాడేరు సీఐ సుధాకర్ శనివారం వెల్లడించారు. డి.కొత్తూరు గ్రామానికి చెందిన కొండపల్లి కొండలరావు అనే వ్యక్తి ఈనెల 7న గ్రామ శివార్లో కొండచీపురు మొక్కలు నాటేందుకు వెళ్లాడు. ఆ సమయంలో అదే గ్రామానికి చెందిన కొండపల్లి లక్ష్మి అనే మహిళ మేకలు తోలుకుంటూ అటువైపు వెళ్లింది. ఆ సమయంలో కొండపల్లి కొండలరావు నాటిన చీపురు మొక్కలను మేకలు తినేశాయి. దీంతో వీరి మధ్య ఘర్షణ జరిగింది. అనంతరం వారు ఇరువురు ఎవరికి వారు గ్రామానికి వచ్చేశారు. కొండపల్లి కొండలరావు అనే వ్యక్తి తనను చేయి పట్టుకుని లాగాడని ఈ విషయంపై రేపు జరిగే పంచాయితీకి రావాలని కొండపల్లి లక్ష్మి ఇంటింటికీ వెళ్లి చెప్పింది. 7వ తేదీ రాత్రి 10 గంటల సమయంలో కొండలరావు నాటు తుపాకీతో వేటకు వెళ్తూ లక్ష్మి ఇంటికి వెళ్లి.. రేపు ఎందుకు పంచాయితీ పెడుతున్నావని గట్టిగా నిలదీశాడు. ఆ సమయంలో లక్ష్మి, ఆమె భర్త.., కొండలరావు మధ్య తీవ్ర



కొండలరావు మృతదేహం

వాగ్వాదం చేటుచేసుకుంది. ఆ సమయంలో నాటుతుపాకీ పేలిన శబ్దం వచ్చిందని కొండలరావు తల, గెడ్డం భాగాల్లో తీవ్ర గాయాలు కావడంతో మృతి చెందాడని సీఐ సుధాకర్ తెలిపారు. ఘర్షణ సమయంలో నాటుతుపాకీ ప్రమాదవశాత్తు పేలడంతో మృతి చెందాడా లేక ఎవరైనా పేల్చడం వల్ల మృతి చెందాడా అనే విషయమై దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. కేసు విచారణ అనంతరం పూర్తి వివరాలు వెల్లడిస్తామని సీఐ చెప్పారు.

వాగు దాటుతుండగా అదుపుతప్పిన బైక్

- బైక్‌తో పాటు వాగులో కొట్టుకుపోయిన బుంగాపుట్టు గిరిజనులు
- కాపాడిన స్థానికులు

ముంచంగిపుట్టు: మండలంలోని మారుమూల లక్ష్మీపురం పంచాయతీ బిరిగూడ వాగును బైక్‌పై ఒడిశాకు చెందిన గిరిజనుడు దాటుతూ అదుపుతప్పి కొట్టుకుపోయిన సంఘటన శనివారం ఉదయం చోటుచేసుకుంది.దీనిని గమనించిన స్థానిక గిరిజనులు వెంటనే అతనిని కాపాడడంతో ప్రాణాపాయం తప్పింది.బుంగాపుట్టు పంచాయతీ కేంద్రానికి చెందిన నీలకంఠం,రాజారావులు శనివారం ఉదయం మండలంలోని లక్ష్మీపురం పంచాయతీ కేంద్రానికి వచ్చి పనులు పూర్తి చేసుకొని మళ్లీ బైక్‌పై గ్రామానికి బయలుదేరారు. మార్గ మధ్యంలోని బిరిగూడ వాగు దాటుతుండగా నీటి ఉధృతికి బైక్ అదుపుతప్పి బైక్‌తో పాటు ఇద్దరూ కొట్టుకుపోతుండగా గమనించిన స్థానికులు వాగులోకి దిగి వారిని రక్షించి,బైక్‌ను బయటకు తీశారు. ఇద్దరు గిరిజనులు స్వల్ప గాయాలు అయ్యాయి. వాగులో నీటి ఉధృతిను తక్కువ అంచనా వేయడం



బిరిగూడ వాగులో బైక్‌తో కొట్టుకుపోతున్న బుంగాపుట్టు గిరిజనులు

లో ప్రమాదం జరిగిందని స్థానికులు తెలిపారు.

బైకు మోస్తూ వాగు దాటిన ఒడిశా వాసి

లక్ష్మీపురం పంచాయతీ సుత్తిగూడ గ్రామంలో బంధువుల ఇంటికి వచ్చిన ఒడిశా రాష్ట్రం మల్కన్‌గిరి జిల్లా గుమ్మ బ్లాక్ పనసపుట్టు గ్రామానికి చెందిన మహేష్ హంతల్ తిరుగూ ప్రయాణంలో బిరిగూడ వాగు దాటేందుకు బాహుబలిలా మారాడు. బైకును భుజాలపై మోసుకుని వాగును దాటే ప్రయత్నం చేశాడు. కొంత దూరం వెళ్లాక వరద నీటి ఉధృతకు వాగులో బైకు దింపేసి అక్కడ నుంచి మరొకరు సహాయంతో అతి కష్టం మీద వాగును దాటించాడు.



బైకును మోస్తూ బిరిగూడ వాగు దాటుతున్న ఒడిశా గిరిజనుడు

రూ. 3.55లక్షలతో బిరిగూడ వంతెన నిర్మాణం

లక్ష్మీపురం పంచాయతీ బిరిగూడ వాగుపై వంతెన నిర్మాణానికి రూ.3.55 కోట్లు మంజూరైనట్టు పీఆర్ ప్రాజెక్టు ఏఈఈ సంతోష్ తెలిపారు.శనివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ లక్ష్మీపురం నుంచి బుంగాపుట్టు వెళ్లే మార్గంలో మూడు చోట్ల వంతెనల నిర్మాణానికి నిధులు మంజూరైనట్టు చెప్పారు.బిరిగూడ వద్ద రూ.3.55 కోట్లు,ముత్తగుమ్మి వద్ద రూ3.11కోట్లు,సుత్తిగూడ వద్ద రూ.3కోట్లతో వంతెనలు నిర్మించనున్నట్టు చెప్పారు.

సుంకరమెట్ట చోరీ కేసులో ఐదుగురి అరెస్టు



విలేకరులతో మాట్లాడుతున్న ఏఎస్పీ ధీరజ్



స్వాధీనం చేసుకున్న బంగారం, నగదు

అరకులోయ టౌన్: అరకులోయ పోలీస్ సర్కిల్ పరిధిలోని సుంకరమెట్ట గ్రామంలో గతనెల 10న జరిగిన చోరీ కేసులో ఐదుగురు నిందితులను అరెస్ట్ చేసి, ఐదువేల నగదు, అరతులం బంగారం ,బొలేరో వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్టు పాడేరు ఏఎస్పీ ధీరజ్ తెలిపారు. స్థానిక పోలీస్ సర్కిల్ కార్యాలయంలో శనివారం ఆయన కేసు వివరాలు వెల్లడించారు. బాధితుడు పాంగి సురేంద్ర ఇచ్చిన ఫిర్యాదు మేరకు అరకులోయ సీఐ సీహెచ్ రుద్రశేఖర్,ఎస్ఐ సంతోష్ చాకచక్యంగా దర్యాప్తు చేసి, చోరీకి పాల్పడిన ఆంధ్ర,ఒడిశా రాష్ట్రాలకు చెందిన ముఠా సభ్యులను అరకులోయలో పట్టుకున్నట్టు చెప్పారు. గతనెల 10వ తేదీ రాత్రి ఒడిశా,ఆంధ్రకు చెందిన 15 మంది సురేంద్ర ఇంట్లో ప్రవేశించారు. బీరువాలోని రూ.1.20లక్షల నగదు,రెండు తులాల బంగారం చోరీ చేశారన్నారు. ఆ 15 మందిలో శనివారం ఐదుగురిని అరెస్టు చేసినట్టు ఏఎస్పీ చెప్పారు. అరెస్టు అయిన వారిలో ఒడిశా రాష్ట్రం కోరాపుట్ జిల్లా అరిజన్ సాహి సమీపంలోని సిమిలిగూడ గ్రామానికి చెందిన భగిరధి ఖోసల(40), నందపూర్ బ్లాక్ చటువ పంచాయతీ ఉపర్కండపల్లి గ్రామానికి చెందిన పరుశురాం ఖార(37), అరకులోయ మండలం సుంకరమెట్ట పంచాయతీ కొత్తబోయిగూడ గ్రామానికి చెందిన నందుల గంగులు(50),బోయిగూడ గ్రామానికి చెందిన కొర్రా అప్పారావు (40), అనంతగిరి మండలం ఎగువశోభ పంచాయతీ పిత్తగూడ గ్రామానికి చెందిన గెమ్మెలి రంగన్న(59) ఉన్నారు. వీరిని కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించమన్నారు.మరో 10మంది ఒడిశాకు చెందిన నిందితులను గుర్తించామని త్వరలో వారిని అరెస్టు చేస్తామని చెప్పారు. రూ.1.15 లక్షల నగదు,తులంన్నర బంగారం రికవరీ చేయాల్సి ఉందన్నారు. ఈ కేసులో నిందితుడైన పరారీలో ఉన్న కోరాపుట్‌కు చెందిన రంగిల అనే వ్యక్తిపై ఏడు కేసులు ఉన్నట్టు ఏఎస్పీ తెలిపారు. నిందితులను పటుకున్న సీఐ రుద్రశేఖర్,ఎస్ఐ సంతోష్‌లను ఏఎస్పీ అభినందించారు,

అంతర్ జిల్లాల గంజాయి ముఠా ఆటకట్టు

- ఏడుగురు నిందితుల అరెస్టు
- 21 కేజీల గంజాయి స్వాధీనం

ఒంగోలు టౌన్: జిల్లాలోని చీమకుర్తి పోలీసుస్టేషన్ పరిధిలో గంజాయి విక్రయిస్తున్న ఏడుగురు అంతర్ జిల్లాల ముఠా సభ్యులను పోలీసులు అరెస్టు చేశారు. జిల్లా పోలీసు కార్యాలయలంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎస్పీ మలికాగర్గ్ వివరాలు వెల్లడించారు. అల్లూరి సీతారామరాజు జిల్లా వంటివీధుల గ్రామానికి చెందిన వంతల వెంకటరావు ఆర్థిక సమస్యల నుంచి బయట పడేందుకు గంజాయి విక్రయాలు ప్రారంభించాడు. ఒడిశా నుంచి తీసుకువచ్చిన గంజాయిని ప్రకాశం, బాపట్ల జిల్లాల్లో విక్రయించసాగాడు. అతడితో పాటు బాపట్ల జిల్లాకు చెందిన బండారు శేఖర్, ప్రకాశం జిల్లాకు చెందిన బింగి యోహాను, గుర్నాథం దుర్గా, పాలపర్తి ప్రభుదాసు, కట్టా కోటయ్య, నాగులూరి కమలమ్మలతో కలిసి గంజాయి విక్రయిస్తున్నాడు. సమాచారం తెలుసుకున్న ఎస్పీ మలికాగర్గ్ స్వీయ పర్యవేక్షణలో ఒంగోలు డీఎస్పీ వి.నారాయణస్వామిరెడ్డి ఆధ్వర్యంలో రూరల్ సీఐ శ్రీనివాసరెడ్డి, చీమకుర్తి ఎస్సై జి.రామిరెడ్డి, ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. శనివారం తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు మర్రిచెట్లపాలెం సమీపంలో నిందితులను అరెస్టు చేశారు. మర్రిచెట్లపాలెం గ్రామ పరిధిలోని ప్రభుత్వ మద్యం దుకాణం వద్ద ఉన్న ముళ్లపొదల వద్ద సుమారు రూ.2 లక్షల విలువైన 21 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. గంజాయి ముఠాను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన పోలీసులను ఎస్పీ అభినందించారు.